ఎన్నికల విధులకు టీచర్ల వివరాల సేకరణ

సాలూరు రూరల్, ఫిబ్రవరి 7: ఎన్నికల విధులకు సంబంధించి మండలాల వారీగా ఉపాధ్యాయుల వివరాలను సత్వరమే అందించాలని ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో ఎంఈవోలు తమ మండలంలో పనిచేస్తున్న టీచర్ల జాబితాను సిద్ధం చేస్తున్నారు. హోదా, పనిచేస్తున్న మండలం, సొంత మండలం, ఆ ఉపాధ్యాయునికి ఓటు హక్కు ఏ అసెంబ్లీ సెగ్మెంట్‌లో ఉంది? ఇప్పటి వరకు ఎన్నికల్లో పీవో, ఏపీవో, ఓపీవోగా పనిచేశారా? అనే తదితర వివరాలను సేకరిస్తున్నట్టు తెలిసింది. టీచర్ల వివరాలను ప్రొఫార్మాలో ఇవ్వాలని ఎన్నికల కమిషన్ కోరడంతో ఎంఈవోలు ఆ పనుల్లో నిగ్నమయ్యారు.

మంచు టెండ

- ఉదయం మంచు.. మధ్యాహ్నం ఎండ ● కొన్నిచోట్ల సాయంత్రం వేళల్లో చిరుజల్లులు
- జిల్లాలో విభిన్న వాతావరణ పరిస్థితులు ● ఉదయం తొమ్మిది గంటల వరకు పొగమంచు ప్రభావం
- ఆ తర్వాత క్రమేణా పెరుగుతున్న ఉష్ణోగ్రతలు ● ఈ మార్పులతో జిల్లావాసులకు తప్పని ఇబ్బందులు
- వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ఆందోళన ● జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్య నిపుణులు





పార్వతీపురంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానాన్ని కమ్మేసిన పొగమంచు

పార్వతీపురం టౌన్/కొమరాడ/భామిని: జిల్లాలో విభిన్న వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. ఉదయం వేళల్లో దట్టంగా పొగమంచు కురుస్తుండగా.. మధ్యాహ్నం వేళ ఎండ ఠారెత్తిస్తోంది. ఒక్కసారిగా మారిన ఈ వాతావరణంతో జిల్లావాసులు ఇబ్బందులు పడుతున్నారు. వాస్తవానికి మన్యాన్ని కొద్దిరోజులుగా మంచు దుప్పటి కప్పేస్తోంది. ఉదయం తొమ్మిది గంటల వరకు ఇదే పరిస్థితి. దీంతో రహదారులపై ఎదురుగా వచ్చే వాహనాలు సైతం కనిపించడం లేదు. వాహనదారులు లైట్లు వేసుకుని రాకపోకలు సాగించాల్సి వస్తోంది. ఓ మోస్తరుగా చలి కూడా ఉండడంతో చిన్నారులు, వృద్ధులు ఇళ్ల నుంచి బయటకు రాలేకపోతున్నారు. సామాన్యులు సైతం తెల్లవారుజామున వాకింగ్ చేయలేని పరిస్థితి. జీడి, మామిడి, అపరాలు, వాణిజ్య పంటలపైనా పొగమంచు ప్రభావం పడుతోంది. అయితే ఉదయం పది గంటల తర్వాత మాత్రం సీన్ మారుతోంది. మెల్లగా పొగమంచు తొలగిపోగా.. భానుడు తన ప్రతాపం చూపుతున్నాడు. వాస్తవంగా ఏటా రథసప్తమి, మహాశివరాత్రి తర్వాత ఉష్ణోగ్రతలు పెరుగుతుంటాయి. అయితే ఈ సారి అందుకు భిన్నమైన పరిస్థితి నెలకొంది. మధ్యాహం సమయాల్లో ఎండ వేడి అధికంగా ఉండగా.. ఉక్కపోత కూడా ప్రారంభమైంది. ఒక్కసారిగా ఉష్ణోగ్రతలు పెరగడంతో జిల్లావాసులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఇప్పుడే ఇలా ఉంటే ముున్ముందు ఇంకెలా ఉంటుందోనని ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది వేసవిలో తొలుత మోస్తరు వేడి, ఆ తరువాత క్రమేపీ తీవ్రమైన ఎండలతో వడగాడ్పులు వీస్తాయని వాతావరణ నిపుణులు సైతం హెచ్చరిస్తుండడంతో ప్రజలు మరింతగా టెన్షన్ పడుతున్నారు. ప్రస్తుతం జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు గరిష్ఠంగా 30 డిగ్రీల మేర నమోదవుతున్నాయి. సాయంత్రానికి కనిష్ఠంగా 20 నుంచి 19 డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు ఉంటున్నాయి. అయితే రానున్న కాలంలో ఎండ తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉంది. గతేడాది కంటే తీవ్రమైన వేసవి చూడబోతున్నామని ఇప్పటికే వాతావరణ శాఖ ప్రకటించింది. ఎల్‌నినో ప్రభావంతో ఈ వేసవి హాట్‌గా ఉంటుందని అంచనా వేస్తోంది. ఏదేమైనా ప్రస్తుతం జిల్లాలో ఉదయం పొగమంచు.. మధ్యాహ్నం ఎండ తీవ్రత అధికంగా ఉంది. ఈ వాతావరణంలో మార్పులను ప్రకృతి ప్రేమికులు ఆస్వాదిస్తుండగా.. మన్యం వాసులు మాత్రం నానా అవస్థలు పడుతున్నారు. ఇదే సమయంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని వారు ఆందోళన చెందుతున్నారు.



భామినిలో చిరుజల్లులు పడుతున్న దృశ్యం

భామినిలో చిరుజల్లులు..

భామినిలో బుధవారం ఒక్కసారిగా వాతావరణం మారింది. ఉదయం పొగ మంచు.. మధ్యాహ్నం ఎండ అధికంగా ఉండగా.. సాయంత్రం మాత్రం ఆకాశం మేఘావృతమైంది. ఆ తర్వాత ఓ మోస్తరుగా చిరుజల్లులు పడ్డాయి. గత ఐదు నెలలుగా చినుకు తడి లేదని .. భారీ వర్షం కురిసి ఉంటే.. రబీ పంటలకు ఉపయోగపడేదని మండల రైతులు తెలిపారు. నువ్వు దుక్కులకు, మామిడి, జీడికి మేలు జరిగేదని వారు చెబుతున్నారు.

అడ్డగింతలు.. అరెస్టులు

- ఆశా వర్కర్ల 'చలో విజయవాడ'పై ప్రభుత్వ నిర్బంధం
- ఎక్కడికక్కడే అడ్డుకున్న పోలీసులు .. ముందస్తుగా హౌస్ అరెస్టులు
- నోటీసులు అందజేత.. ప్రజా సంఘాల నేతలూ అదుపులోకి..



గుమ్మలక్ష్మీపురం: ఎల్విన్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఉన్న ఆశా కార్యకర్తలు

పార్వతీపురం టౌన్/బెలగాం/సాలూరు/ సాలూరు రూరల్/ కురుపాం/ గుమ్మ లక్ష్మీపురం, ఫిబ్రవరి 7 : తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ.. గురువారం చలో విజయవాడకు పిలుపునిచ్చిన ఆశావర్కర్లను బుధవారం జిల్లాలో పోలీసులు ఎక్కడికక్కడే అడ్డుకున్నారు. ముందస్తుగా హౌస్ అరెస్టులు చేశారు. నోటీసులు అందించారు. వారికి మద్దతు తెలుపుతున్న ప్రజా సంఘాల నేతలను సైతం అదుపులోకి తీసుకున్నారు. మరికొందర్ని పోలీస్ స్టేషన్‌లో ఉంచారు. మొత్తంగా జిల్లాలో 166 మందిని గృహనిర్బంధం చేశారు. అయితే దీనిపై ఆశావర్కర్లు, ప్రజా సంఘాలు, యూనియన్ నేతలు మండిపడుతున్నారు. సర్కారు తీరును ఖండిస్తున్నారు. అక్రమ అరెస్టులు, నిర్బంధాలతో పోరాటాలను ఆపలేరని స్పష్టం చేశారు. కాగా పార్వతీపురంలోని సుందరయ్య భవనంలో సీఐటీయూ నాయకులు యమ్మల మన్మథరావు, గొర్లి వెంకటరమణను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మహిళా నాయకురాలు వాకాడ ఇందిరను అరెస్టు చేసి సీతానగరం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. విజయవాడ వెళ్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని నోటీసులు ఇచ్చారు. పాదయాత్ర సమయంలో సీఎం జగన్ ఇచ్చిన హామీలను నెరవర్చాలని కోరితే.. ఇలా అరెస్టు చేసి, నోటీసులు ఇస్తారా? అని వారు ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో ఇటువంటి చర్యలు తగవన్నారు. చలో విజయవాడకు బయల్దేరిన వారిని అడ్డుకోవడం ఏమిటని, నిరసన తెలిపే హక్కు లేదా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించకుంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సర్కారు వైఖరిని మేధావులు, విద్యావంతులు ఖండించాలని వారు కోరారు. న్యాయం కోసం పోరాడుతుంటే పోలీసులతో తమ గొంతు నొక్కే ప్రయత్నం చేయడం సరికాదన్నారు. వచ్చే ఎన్నికల్లో ఈ ప్రభుత్వానికి ప్రజలు గట్టిగా సమాధానం చెప్పాలని వారు పిలుపునిచ్చారు. ఇక సాలూరు, పాచిపెంట, మక్కువ మండలాల్లో ఉద్యమాల్లో క్రియాశీలకంగా వ్యవహరించే 37 మందిని హౌస్ అరెస్ట్ చేశారు. పాచిపెంట మండలానికి చెందిన సీఐటీయూ నేత కోరాడ ఈశ్వరరావు సాలూరు మండలం మరిపిల్లిలో ఇంటికి రాగా.. ఆయన్ను అక్కడే సాలూరు రూరల్ ఎస్ఐ వెంకట రమణ గృహనిర్బంధం చేశారు. మామిడిపల్లిలో ఆశా వర్కర్ రాజేశ్వరికి నోటీసు ఇచ్చారు. సాలూరులో సీఐటీయూ నేత ఎన్‌వై నాయుడిని కూడా పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. కురుపాంలో ఎస్ఐ షణ్ముఖరావు ఆధ్వర్యంలో పోలీసులు ముందుగా ఆశవర్కర్లను అదుపులోకి తీసుకొని బైండోవర్ కేసులు నమోదు చేశారు. గుమ్మలక్ష్మీపురం మండలంలో సీఐటీయూ నేత గౌరీశ్వరరావు ఆధ్వర్యంలో విజయవాడకు వెళ్తున్న ఆశ వర్కర్లను ఎల్విన్‌పేట పోలీసులు అడ్డుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.







పార్వతీపురం టౌన్, సాలూరు పట్టణం, మండలంలోని మరిపిల్లిలో సీఐటీయూ నేతలను అడ్డుకున్న పోలీసులు



సాలూరు మండలం మామిడిపల్లిలో ఆశా కార్యకర్తకు నోటీసు ఇస్తున్న రూరల్ ఎస్ఐ

ఓటరు జాబితా అప్‌డేట్

- కలెక్టర్ నిశాంత్‌కుమార్ వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

పార్వతీపురం రూరల్: ఎన్నికల కమిషన్ సూచనల మేరకు ఓటరు జాబితా అప్‌డేట్ చేస్తున్నట్లు కలెక్టర్ నిశాంత్‌కుమార్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో పలు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల కమిషన్ ఓటరు జాబితా సవరణ ప్రక్రియ నిలుపుదల చేసే వరకు అప్‌డేట్ చేస్తుంటామని చెప్పారు. ఈవీఎంలు, వీవీప్యాడ్‌లపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని, వాటి నిర్వహణపై సిబ్బందికి కూడా శిక్షణ ఇచ్చామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి జిల్లా రెవెన్యూ అధికారి కేశవనాయుడు తదితరులు పాల్గొన్నారు.

● రక్తహీనత రహిత జిల్లాగా మారాలి..

పార్వతీపురం మన్యం రక్తహీనత రహిత జిల్లాగా మారాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. జిల్లాలో ప్రిజమ్-10 ప్రాజెక్టు అమలు, అభిలాష తదితర అంశాలపై మండల అధికారులతో కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ప్రతి మండలంలో రక్తహీనత నివారణ కార్యాచరణ బృందం ఏర్పాటు చేశామన్నారు. గ్రామ, వార్డు స్థాయిలో ఆశ, ఏఎన్‌ఎం, అంగన్‌వాడీ కార్యకర్త, మహిళా పోలీస్‌లు ఉంటారని, వారంతా ఎంపీడీవో పర్యవేక్షణలో పని చేస్తారని చెప్పారు. రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, కిషోరీ బాలికలను గుర్తించి క్రమం తప్పకుండా ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు పంపిణీ చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ నెల 9న నిర్వహించనున్న డీవార్మింగ్ డేను విజయవంతం చేయాలన్నారు. గ్రామ సచివాలయాల్లో అభిలాష గ్రంథాలయాలు ప్రారంభమయ్యాయని, 66 రకాల పుస్తకాలు రెండు సెట్ల చొప్పున అందుబాటులో ఉంచామని వెల్లడించారు.



- పూర్తికాని సీతానగరం పీహెచ్‌సీ భవన నిర్మాణం
- ఎప్పటికి అందుబాటులోకి వస్తుందో తెలియని పరిస్థితి
- వైద్య సిబ్బంది, రోగులకు తప్పని అవస్థలు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

నాలుగేళ్లయినా..



ఈ ఫొటోలు చూసి.. ఇదేదో పాత భవనం అనుకుంటే పొరబడినట్టే. సీతానగరంలో పీహెచ్‌సీ నూతన భవనం ఇది. అర్ధంతరంగా పనులు నిలిచిపోవడంతో ఇలా మారింది. నాలుగేళ్లయినా ఈ పీహెచ్‌సీ భవన నిర్మాణానికి మోక్షం కలగడం లేదు. పనులు తుది దశకు చేరుకోవడం లేదు. నేటికీ అందు బాటులోకి రాకపోవడంతో సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వాస్తవంగా మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనం శిథిలావస్థకు చేరింది. దీంతో 2020లో ఆ పీహెచ్‌సీకి పక్కనే నూతన భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. నాడు-నేడు కింద రూ.1.66 లక్షలతో పనులు చేపట్టాలని నిర్ణయించారు. ఈ మేరకు ఎమ్మెల్యే జోగారావు శిలాఫలకం కూడా ఆవిష్కరించారు. అయితే ఇప్పటికీ నిర్మాణం పూర్తవడం లేదు. అర్థాంతరంగా పనులు నిలిచిపోయాయి. ప్రస్తుతం పిచ్చిమొక్కలతో పాడుబడిన భవనంలా అది దర్శనమిస్తోంది. ఎన్నికలకు సమయం సమీపిస్తుండగా.. ఇది ఎప్పటికి అందుబాటులోకి వస్తుందన్నది ప్రశ్నార్థకంగా మారింది. మరోవైపు ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం పాత భవనంలో సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వర్తించాల్సి వస్తోంది. ఏ క్షణంలో భవనం కుప్పకూలుతుందోనని వారు భయాందోళన చెందుతున్నారు. పాత భవనంలో తరచూ షార్ట్ సర్క్యూట్ కారణంగా వారంలో రెండు సీలింగ్ ఫ్యాన్లు పోతున్నాయి. వర్షం పడితే.. స్లాబ్ నుంచి నీరు కారిపోతుండగా.. మందులు, బెడ్‌లు తడిసిపోతున్నాయి. మరోవైపు రోగులు కూడా శిథిలావస్థలో ఉన్న పీహెచ్‌సీకి వెళ్లాలంటే జంకుతున్నారు. నాలుగేళ్లుగా ఇదే పరిస్థితి ఉన్నా.. ఎవరూ పట్టించుకోకపోవడంపై స్థానికులు పెదవి విరుస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. దీనిపై ఆర్అండ్‌బీ జేఈ రామ్మోహన్‌ను వివరణ కోరగా.. భవన నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్ సుదూర ప్రాంతం నుంచి జిల్లాకు రావల్సి ఉండడంతో పనులను మధ్యలోనే ఆపేసి వెళ్లిపోయారని తెలిపారు. దీనిపై ఆయనకు నోటీసు కూడా అందించామన్నారు. కొత్త కాంట్రాక్టర్‌తో మాట్లాడి పీహెచ్‌సీ పనులు చేపడతామని ఆయన స్పష్టం చేశారు.

- సీతానగరం

స్ట్రాంగ్ రూముల ఏర్పాటుకు చర్యలు

- భవనాల పరిశీలనలో అధికారులు

పాలకొండ/వీరఘట్టం/కురుపాం, ఫిబ్రవరి7: ఎన్నికలకు సమయం దగ్గర పడుతుండడంతో జిల్లాలో స్ట్రాంగ్ రూముల ఏర్పాటుకు చర్యలు చేపడుతు న్నారు. ఈ మేరకు అధికారులు భవనాల పరిశీలనలో నిమగ్నమయ్యారు. దీనిలో భాగంగా పాలకొండలోని ప్రభుత్వ బాలుర, బాలికల జూనియర్ కళాశాలలను బుధవారం ఐటీడీఏ పీవో కల్పనాకుమారి సందర్శించారు. స్ట్రాంగ్ రూం ఏర్పాటుకు అవసరమయ్యే అన్ని రకాల సౌకర్యాలు ఉన్నాయా లేదా అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అన్ని సదుపాయాలు ఉన్న భవనాన్నే స్ట్రాంగ్ రూం కోసం ఎంపిక చేస్తామని ఆమె తెలిపారు. అనంతరం ఆమె వీరఘట్టంలోని సీబీఎం స్కూల్‌లోని పోలింగ్ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సౌకర్యాలపై అధికారులకు తగు సూచనలు చేశారు. మరోవైపు కురుపాంలో జూనియర్ కళాశాల, వసతి గృహం రూములను పాలకొండ ఆర్డీవో టీవీ రమణ సందర్శించారు. 2019 ఎన్నికల సమయంలో ఈ కళాశాలలో ఈవీఎంలను ఎలా భద్రపరిచారని సీనియర్ అధ్యాపకుడు ఎస్.మురళీకృష్ణ, వసతిగృహం వార్డెన్ సీహెచ్ సాంబమూర్తిని అడిగి తెలుసుకున్నారు. వారి వెంట తహసీల్దార్లు, డీటీ, ఆర్ఐ, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.



నిరాశే..

- బడ్జెట్లో కానరాని కొత్తదనం ● అరకొరగా కేటాయింపులు
- గిరిజన విశ్వ విద్యాలయం ఎప్పటికో..



(విజయనగరం- ఆంధ్రజ్యోతి)

బడ్జెట్ ఈసారి కూడా నిరాశనే మిగిల్చింది. ఉమ్మడి జిల్లాకు కనీస స్థాయిలో కేటాయింపులు లేవు. కొత్తవి తేలేదు.. ఉన్న వాటికి నిధులివ్వలేదు. ఇప్పటికే అమలు చేసిన పథకాలు.. వాటికి ఖర్చు చేసిన గణాంకాలను వెల్లడించేందుకే ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రాధాన్యం ఇచ్చారు. అసెంబ్లీలో బుధవారం రూ.2,86,389 కోట్ల అంచనాతో ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఈ నాలున్నరేళ్లుగా ఖర్చు చేసిన గణాంకాలనే వివరించారు.

గిరిజనాభివృద్ధి ఇదేనా?

గిరిజనాభివృద్ధికి కట్టుబడి ఉన్నామని మంత్రి వివరించారు. కేంద్రం అందించే నిధులతో చేపట్టాల్సిన ట్రైబల్ యూనివర్సిటీ పనులు ఇప్పటికీ చేపట్టలేదు. అట్టహాసంగా సీఎం జగన్ శంకుస్థాపన చేశారు. ఆ ప్రాంతంలో వేసిన శిలాఫలకం కూడా కన్పించడం లేదు. ఇక ఐటీడీఏలకు చిల్లి గవ్వ నిధులు కూడా విదల్చడం లేదు. ఉమ్మడి జిల్లా పాచి పెంట మండలం శతాబి, తంగ్లాం గిరిజన రైతులు కాఫీ సాగు చేపడుతున్నారు. కానీ ఆ ఉత్పత్తులను గిరిజన కార్పొరేషన్ కొనుగోలు చేయడం లేదు.

ఫిష్ ఆంధ్రా యూనిట్లు పనిచేస్తున్నాయా?

ఫిష్ ఆంధ్రా ద్వారా మత్స్యకారులకు చేయూతనిచ్చినట్లు బుగ్గన వివరించారు. క్షేత్రస్థాయిలో చూస్తే పూర్తి భిన్నం. అట్టహాసంగా ఫిష్ ఆంధ్రా బోర్డులు పెట్టి అమలులో విఫలమైంది. ఉమ్మడి జిల్లాలో చాలా వరకు ఆ యూనిట్లు మూతపడ్డాయి.

అగ్రిగోల్డ్ బాధితులకు భరోసా లేకపోయె..

ఎన్నికల్లో హామీ మేరకు నేటికీ అగ్రిగోల్డ్ బాధితుల సమస్యను పరిష్కరించలేదు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేలాది మంది బాధితులు ఉన్నారు. కొంత మంది రూ.10వేల లోపు డిపాజిట్ దార్లకు కూడా ఏదో వంక చెప్పి చెల్లింపులు చేయలేదు. కానీ ఆర్థిక మంత్రి మాట్లాడుతూ.. అగ్రి గోల్డ్ బాధితుల సమస్యలు పరిష్కరించేసినట్లు అసెంబ్లీలో చెప్పడం గమనార్హం.

పశు బీమా ఏదీ?

పశు బీమా పథకాన్ని బేషుగ్గా అమలు చేస్తున్నామన్నారు. ఉమ్మడి జిల్లాలో వందలాది మంది రైతులు తమ పశువులను కోల్పోయి నష్టాలకు గురయ్యారు. వారిని బీమాతో ఆదుకోలేదు. ప్రభుత్వం నిధులు విదల్చని కారణంగా పశు బీమా అమలు కావడం లేదు.

అభాసుపాలైన ఆడుదాం ఆంధ్రా

ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీకు ఉమ్మడి జిల్లాలో క్రీడాకారులు మొగ్గు చూపలేదు. పైగా గొడవలతో చాలాచోట్ల నిలిచిపోయాయి. వీటికి నిర్వహణా ఖర్చులు కూడా ఇవ్వలేదు. గ్రామ స్థాయిలో కొన్ని చోట్ల మొక్కుబడిగా కొన్ని క్రీడా పరికరాలు అందించి చేతులు దులుపుకున్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్ర భవిష్యత్తు

రామభద్రపురం: రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని గెలిపించడం ద్వారా అన్ని వర్గాల ప్రజలకు మంచి జరుగుతుందని మండల తెలుగు యువత అధ్యక్షుడు ముల్లు రాంబాబు అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ ఎంతో అనుభవజ్ఞుడైన చంద్రబాబునాయుడు సీఎం అయితేనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందన్నారు. మోస పూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన జగన్మోహన్‌రెడ్డి రాష్ట్ర భవిష్యత్తును నాశనం చేయడమే కాకుండా ఖజానాను లూటీచేశాడని ఆరోపించారు.

జేసీని కలిసిన బీజేపీ నాయకులు

కలెక్టరేట్: జేసీగా బాధ్యతలు స్వీకరించిన కార్తీక్‌ను జిల్లా బీజేపీ నాయకులు బుధవారం సా యంత్రం కలిశారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ సెల్ కన్వీనర్ చాంద్, జాతీయ లీగల్ సెల్ కన్వీనర్ శర్మ, రాష్ట్ర కిసాన్ మోర్చా అధ్యక్షులు సత్యారావు తదితరులు ఉన్నారు.

బోరు ఏర్పాటు

తెర్లాం: మండలలోని కూనాయవలస పంచాయతీ జన్నివలస గ్రామంలో బుధవారం బొబ్బిలి తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి బేబీనాయన సొంత నిధులతో బోరింగును ఏర్పాటు చేశారు. తమ సొంత నిధులతో బోరింగు ఏర్పాటు చేసిన బేబీనాయనకు గ్రామస్థులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూనాయవలస, జన్నివలస నాయకులు, క్రైస్తవులు పాల్గొన్నారు.

రేపు ఉపాధి హామీ సోషల్ ఆడిట్

శృంగవరపుకోట: ఈనెల 9న శృంగవరపుకోట జాతీయ ఉపాధి హామీ పథకం సోషల్ ఆడిట్‌ను నిర్వహిస్తున్నట్లు మండల ప్రజాపరిషత్ అధికారులు తెలిపారు. ఏప్రిల్ 2022 నుంచి మార్చి 2023 వరకు పనులు, చెల్లింపుల వంటి వాటిపై చర్చ ఉంటుందన్నారు.

ఉచిత వైద్య శిబిరం

శృంగవరపుకోట: ఎస్.కోట ఆర్టీసీ డిపోలో బుధవారం విశాఖ మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత డయాబెటిక్ వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ జి.అశ్విని 50 మంది ఉద్యోగులకు పరీక్షలు నిర్వహించారు. డీఎం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

తీరిన 'మరుగు' సమస్య

రేగిడి: దేవుదళ హైస్కూల్ విద్యార్థులకు ఎట్టకేలకు మరుగుదొడ్డి సమస్య తీరింది. ఇక్కడి మరుగుదొడ్లు వినియోగానికి దూరంగా ఉన్నాయి. దీన్ని గుర్తించిన ఎంఈవో వరప్రసాదరావు తక్షణమే వినియోగంలోకి తీసుకురావాలని హెచ్‌ఎం రాజ్యలక్ష్మికి ఆదేశించారు. దీంతో యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు పూర్తి చేశారు. బుధవారం నుంచి వీటిని అందుబాటులోకి తెచ్చారు.

బ్రాహ్మణ సాధికారిక కమిటీ ఏర్పాటు

విజయనగరం రూరల్: విజయనగరం పార్లమెంటు బ్రాహ్మణ సాధికారిక కమిటీని బుధవారం టీడీపీ జిల్లా అధ్యక్షుడు నాగార్జున ప్రకటించారు. ఈ కమిటీకి కన్వీనర్‌గా ఇనుగంటి రాకేష్ శర్మ(విజయనగరం), సభ్యులుగా ఆదుర్తి వాసుదేవరావు (విజయనగరం) ఆదిభట్ల నారాయణ దాసు (బొబ్బిలి), భోగవరపు రామకృష్ణ(ఎచ్చెర్ల), ఎవీ రమణమూర్తి(గజపతినగరం), పుట్టేపు సిద్దుశర్మ(చీపురుపల్లి), దేశిరాజు వెంకట బాల మురళీకృష్ణ(రాజాం),వడ్లమాని సుభద్ర(విజయనగరం), మర్ల రవికుమార్(విజయనగరం), పప్పు రామజోగయ్య శాస్త్రి(నెల్లిమర్ల), మూల శ్రీకాంత్(విజయనగరం), బడిమర్రి మోహార్ (చీపురుపల్లి), దవళ వెంకటరావు (విజయనగరం), ఇనుగంటి రాజేష్(విజయనగం) ఎంపికయ్యారు. వీరిని పలువురు అభినందించారు.

పరాయి పంచన వ్యవసాయ శాఖ కార్యాలయం



మెయిన్‌రోడ్‌లో శిథిలమైన వ్యవసాయ శాఖ కార్యాలయం

రాజాం రూరల్, ఫిబ్రవరి 7: రాజాం వ్యవసాయ శాఖ ఏడీ కార్యాలయాన్ని పరాయి పంచన నిర్వహిస్తున్నారు. ఇక్కడి మెయిన్ రోడ్డులోని వ్యవసాయ శాఖ కార్యాలయం శిథిలం కావడంతో పట్టణానికి కిలోమీటర్ దూరంలోని మార్కెట్ యార్డులో కార్యాలయాన్ని అయిదేళ్లుగా కొనసాగిస్తున్నారు. దీంతో వెళ్లి వచ్చేందుకు రైతులు అవస్థలు పడుతున్నారు. ఇదంతా ఒకెత్తయితే... అధికారులు, సిబ్బంది ఎప్పుడు వస్తున్నారో, ఎప్పుడు వెళ్లిపోతున్నారో తెలియని పరిస్థితుల్లో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. కోట్లాది రూపాయలతో భవన నిర్మాణాలు చేపట్టామని చెబుతున్న ప్రభుత్వం... అయిదేళ్ల పాలనలో వ్యవసాయ శాఖకు సొంత భవనం నిర్మించలేని దుస్థితిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నాణ్యమైన విద్యను అందించాలి



పాఠశాలను పరిశీలిస్తున్న ఎంఈవో తదితరులు

వేపాడ, ఫిబ్రవరి 7: నైతిక విలువలతో కూడిన నాణ్యమైన విద్యను అందించాలని మండల విద్యాశాఖాధికారి బాలభాస్కరరావు ఉపాధ్యాయులకు సూచించారు. బానాది ఎంపీపీ పాఠశాలను బుధవారం తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలను, టాయిలెట్స్, తరగతి గదులను పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమై నైతిక విలువలు, క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాలని సూచించారు. ఎంఈవో వెంట సీఆర్పీలు, తదితరులు ఉన్నారు.

ఒలింపియాడ్‌లో వీఆర్ పేట విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులకు మెడల్స్, పత్రాలు అందిస్తున్న దృశ్యం

శృంగవరపుకోట రూరల్, ఫిబ్రవరి 7 : వెంకటరమణపేట ఉన్నత పాఠశాల విద్యార్థులు నేషనల్ సైన్స్ ఒలింపియాడ్ పరీక్షల్లో ప్రతిభ చూపించారని హెచ్‌ఎం లక్ష్మి తెలిపారు. బుధవారం ఆ విద్యార్థులకు మండల విద్యాశాఖాధికారి నరసింగరావు పతకాలు, ప్రశంసా పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రసాద్‌రావు, నూకరత్నం తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం

● విజయనగరం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అదితి గజపతిరాజు



విజయనగరంలోని 36వ డివిజన్‌లో పర్యటిస్తున్న అదితి

విజయనగరం రూరల్, ఫిబ్రవరి 7: అభివృద్ధి, సంక్షేమం ప్రాధాన్య అంశాలుగా 2014 నుంచి 2019 వరకూ టీడీపీ పాలన సాగించిందని, ప్రస్తుత వైసీపీ హయాంలో రెండింటినీ విస్మరించారని టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి అదితి గజపతిరాజు చెప్పారు. నగరంలోని 35, 36 డివిజన్‌ల పరిధిలోని వీటీ అగ్రహారం, రొంగలి వీధి, యాతవీధి, గొల్లవీధి, పెద్దవీధి, ఎస్సీ కాలనీ, గాంధీనగర్, సోముల వీధి తదితర ప్రాంతాల్లో బుధవారం భవిష్యత్తుకు భరోసా కార్యక్రమాన్ని నిర్వహించారు. రెండు డివిజన్ల పరిధిలోని అన్ని ప్రాంతాల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అదితి గజపతిరాజుకి ఘన స్వాగతం పలికారు. ఆమె ఇంటింటికీ వెళ్లి మహానాడు వేదికగా చంద్రబాబు నాయుడు ప్రకటించిన హామీలను ప్రజలకు వివరించారు. అనంతరం అదితి గజపతిరాజు మాట్లాడుతూ నిరుపేద, కూలీలు, వృత్తిదారులకు ఎంతో ప్రయోజనం కలిగే అన్న క్యాంటీన్‌ను వైసీపీ నాయకులు ఎత్తేశారన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే ఆరు హామీలను అమలు చేయడంతో పాటు, సంక్షేమం, అభివృద్ధి కోసం కృషి జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ ఆశయ సాధన కోసం కృషి చేద్దాం

టీడీపీ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేద్దామని ఆ పార్టీ విజయనగరం నియోజకవర్గ ఇన్‌చార్జి అదితి గజపతిరాజు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బుధవారం నగరంలోని ఐదో డివిజన్‌కు చెందిన డీవీఎస్‌ఎం రాజు, సత్యనారాయణ రాజు ఆధ్వర్యంలో 50 కుటుంబాలు అధికార వైసీపీని వీడి, టీడీపీలోకి చేరాయి. వీరిని అదితి గజపతిరాజు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, పేదల అభ్యున్నతి కోసం, రాష్ట్ర అభివృద్ధి కోసం ఆనాడు ఎన్టీఆర్ టీడీపీని స్థాపించారన్నారు. ఆనాటి నుంచి నేటి వరకూ టీడీపీ అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల పక్షాన నిలబడిందన్నారు. టీడీపీ నాయకులు రొబ్బి వరలక్ష్మి, గండ్రేటి సన్యాసిరావు, కిల్లాన మహేశ్వరరావు, టీడీపీ నాయకులు ప్రసాదుల ప్రసాద్, ఆల్తి బంగారు బాబు, బొద్దల నర్సింగరావు, కర్రోతు వెంకట నర్సింగరావు, కంది మురళీనాయుడు, ఐదో డివిజన్ ఇన్‌చార్జి రాజు, పొగిరి పైడిరాజు, ఏప రాజు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే బీసీలకు న్యాయం

● బీసీ సదస్సులో గళమెత్తిన నేతలు



బీసీ నినాదంతో హోరెత్తిస్తున్న టీడీపీ నేతలు

లక్కవరపుకోట, ఫిబ్రవరి 7: రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీతోనే బీసీల అభివృద్ధి సాధ్యమని ఎస్.కోట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి తెలిపారు. బుధవారం రంగారాయపురంలో జరిగిన బీసీ సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ పుట్టిందే బీసీల కోసమని, వారి ఆర్థిక అభివృద్ధికి ఎంతగానో కృషి చేసిందని తెలిపారు. బీసీ కార్పొరేషన్ ఏర్పాటు చేసి అభివృద్ధి కోసం కృషి చేసిందన్నారు. విశాఖ పార్లమెంట్ టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు పి.విజయ్‌కుమార్ మాట్లాడుతూ బీసీల ఎదుగుదల టీడీపీతోనే సాధ్యమని తెలిపారు. రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కేబీపీ రాంప్రసాద్ మాట్లాడుతూ నందమూరి తారకరామారావు నుంచి చంద్రబాబునాయుడు వరకు బీసీలకు పెద్దపీట వేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కరెడ్ల ఈశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షులు చొక్కాకుల మల్లునాయుడు, మాజీ ఎంపీపీ కొల్లి రమణమూర్తి, ఎస్.కోట నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి వి.సత్యనారాయణ, బీసీ సెల్ అధికార ప్రతినిధి కోళ్ల శ్రీను, బీసీ సెల్ ఉపాధ్యక్షులు బొబ్బిలి అప్పారావు మాష్టారు తదితరులు పాల్గొన్నారు.

నాబార్డు రుణ అంచనాకు ఆమోదం

కలెక్టరేట్, ఫిబ్రవరి 7: జాతీయ వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి బ్యాంకు (నాబార్డు) 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూపొందించిన జిల్లా పొటెన్షియల్ లింక్డ్ క్రెడిట్ ప్లాన్ రూ.7405.51 కోట్లకు డీసీసీ సమావేశంలో కలెక్టర్ నాగలక్ష్మి ఆమోదం తెలిపారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో బుధవారం నిర్వహించిన డీసీసీ సమావేశంలో ఆమె మాట్లాడారు. పంట ఉత్పత్తి, నిర్వహణ మార్కెటింగ్‌కు, వ్యవసాయం అనుబంధ కార్యకలాపాల కోసం టెర్మ్ లోన్, వ్యవసాయం మౌలిక సదుపాయాల కోసం అంచనాలు వేశామన్నారు. వ్యవసాయ అనుబంధ కార్యకలాపాలకు, క్రెడిట్ ప్రొటెన్షియల్ ఫర్ అగ్రికల్చర్‌కు, సూక్ష్మ, చిన్న మధ్యతరహా సంస్థలకు, హౌసింగ్‌కు, బ్యాంకు క్రెడిట్‌తో కూడిన సామాజిక మౌలిక సదుపాయాలకు, పునరుత్పాదక శక్తికి, డ్వాక్రా సంఘాలకు, సంఘటిత రంగానికి నిధులు కేటాయించినట్లు తెలిపారు. జేసీ కార్తీక్, ట్రైనీ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్, నాబార్డు డీడీఎం నాగార్జున, ఎల్‌డీఎం శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

కోడ్ వచ్చే వరకూ ఓటర్ల జాబితాలో మార్పులు



మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

ఎన్నికల ప్రకటన వెలువడే వరకూ ఓటర్ల జాబితాలో చేర్పులు, మార్పులకు అవకాశం ఉందని కలెక్టరు నాగలక్ష్మి చెప్పారు. పేర్ల తొలిగింపునకు సంబంధించి నియోజకవర్గంలో 0.1 శాతం దాటితే ఎన్నికల కమీషన్ అనుమతి తీసుకోవల్సి ఉందని తెలిపారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో తన చాంబర్‌లో సమావేశం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 4,400 దరఖాస్తులు వచ్చాయని, వాటిని త్వరగా పరిశీలించి, తగిన చర్యలు తీసుకుంటామన్నారు. తమకు అందిన ఫిర్యాదులపైనా చర్యలు తీసుకుని, వాటి వివరాలను తెలియజేస్తామని అన్నారు.

రెసిడెన్సియల్ పాఠశాల సందర్శన



పాఠశాల ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న మోనటరింగ్ బృంద సభ్యులు

బాడంగి, ఫిబ్రవరి 7: మండల కేంద్రంలోని రెసిడెన్సియల్ పాఠశాలను జిల్లా మోనిటరింగ్ బృందం బుధవారం పరిశీలించింది. ఈ సందర్భంగా 2023-24 సంవత్సరంలో పాఠశాలలో ఎల్‌ఐపీ కార్య క్రమం అమలు తీరును పరిశీలించారు. అన్ని సబ్జెక్టుల తరగతి గదులను తనిఖీచేసి ఉపాధ్యాయుల నైపుణ్యాలను పరిశీలించారు. ఈ నెల 20 నుంచి 23 వరకు రాష్ట్ర మోనటరింగ్ బృందం సందర్శించనున్న నేపథ్యంలో తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. బృందసభ్యులు ఎ.నాగేశ్వరరావు, ఎస్.శ్రీనివాసరావు, సత్యంనాయుడు, సోమయాజులు, శంకరరావుతోపాటు ప్రిన్సిపాల్ టి.రామదాసు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

విజయనగరం క్రైం: అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా అగ్నిమాపక సహాయక అధికారి సోమేశ్వరరావు అన్నారు. బుధవారం కోట జంక్షన్ సమీపంలోని ముప్వగోపాల ఆసుపత్రిలో అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవలసిన ముందస్తు చర్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యుత్ వాడకంపై అప్రమత్తంగా ఉండాలని, సిబ్బందికి ఎప్పటికప్పుడు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని యాజమాన్యానికి సూచించారు. ఆసుపత్రి, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం, బియ్యం నిల్వల నమోదు తప్పనిసరి

● జేసీ కార్తీక్



మాట్లాడుతున్న జేసీ కార్తీక్

కలెక్టరేట్: కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు బియ్యం, ధాన్యం హోల్ సేల్, రిటైల్ వ్యాపారులు, రైస్ మిల్లర్లు తమ వద్ద ఉన్న నూకలు, నాన్ బాస్మతి, వైట్ రైస్, పారా బాయిల్డ్ బియ్యం, ధాన్యం నిల్వల వివరాలను కేంద్ర ప్రభుత్వ పోర్టల్‌లో ప్రతి వారం తప్పనిసరిగా నమోదు చేయాల్సి ఉంటుందని జేసీ కార్తీక్ సూచించారు. ప్రతి శుక్రవారం ఆ రోజుకు తమ వ్యాపార సంస్థలో ఉన్న నిల్వ వివరాలు నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. పోర్టల్‌లో స్టాక్ వివరాలు నమోదు చేయని వ్యాపారులు, రైస్ మిల్లర్లపై చర్యలు తీసుకుంటా మన్నారు. జిల్లాలోని బియ్యం వ్యాపారులతో బుధవారం తన చాంబర్‌లో సమావేశం నిర్వహించారు. ఎన్‌ఫోర్సుమెంట్ సిబ్బంది తనిఖీలు చేపట్టిన ఈ పోర్టల్‌లో స్టాక్ వివరాలు నమోదు చేస్తున్నారో? లేదో పర్యవేక్షణ చేయాలని డీఎస్‌వో మధుసూదనరావుకి ఆదేశించారు.

వెటరన్స్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్



మాట్లాడుతున్న శ్రీరాములు

శృంగవరపుకోట, ఫిబ్రవరి 7: విజయనగరం డీఎస్‌ఏ ఇండోర్ స్టేడియంలో ఈనెల 11న జిల్లా స్థాయి వెటరన్స్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్, సెలక్షన్స్ నిర్వహిస్తున్నట్లు జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ సలహాదారు డాక్టర్ పొట్నూరు శ్రీరాములు తెలిపారు. 35 నుంచి 70 ఏళ్ల స్త్రీ, పురుషులకు సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో పోటీలు ఉంటాయన్నారు. సింగిల్స్ రూ.500, డబుల్స్ రూ.1000 ప్రవేశ రుసుం చెల్లించాలన్నారు. ప్రథమ స్థానాల్లో నిలిచే క్రీడాకారులు ఈనెల 16 నుంచి 18 వరకు రాజమండ్రిలో రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. వివరాల కోసం బొబ్బిలికి అపర్ణబాబా 7981111705, సాలూరుకు బహదూర్ తాపా-9494594356, చీపురుపల్లి స్వరూప్-98858 30520, విజయనగరం సురేష్-9440585553, కొత్తవలస వైగణేష్-9032919065, ఎస్.కోట శ్రీరాములు-9490265104ను సంప్రదించాలన్నారు.

బొబ్బిలిలో ఆర్డీవో పర్యటన



బొబ్బిలి కంచరవీధిలో అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీవో

బొబ్బిలి, ఫిబ్రవరి 7: బొబ్బిలి పట్టణంలో ఆర్డీఓ ఎ.సాయిశ్రీ బుధవారం సుడిగాలి పర్యటన చేశారు. కంచరవీధిలో నిర్వహిస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమంపై ఆరా తీశారు. సంగవీధి, పిరిడి సచివాలయాల్లో పేదలందరికీ ఇళ్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించారు. ఆర్డీవో వెంట తహసీల్దారు కిరణ్‌కుమార్, ఎంపీడీవో రవికుమార్, డీటీ రెడ్డి సాయికృష్ణ, మెప్మా టీపీఆర్వో జగన్మోహన్ తదితరులు ఉన్నారు.

జగనన్న ఇళ్ల నిర్మాణం వేగవంతం



మాట్లాడుతున్న ఆర్డీవో శాంతి

రాజాం, ఫిబ్రవరి 7: జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని చీపురుపల్లి ఆర్డీవో బి.శాంతి అధికారులను ఆదేశించారు. నీటి సౌకర్యం లేక లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారని, దీనిని పరిష్కరించాలని సూచించారు. ఇళ్ల నిర్మాణానికి 11 మోటార్లు ఏర్పాటు చేశారని, వాటిని దొంగలు తీసుకుపోయినట్టు పురపాలక సంఘ ఏఈ ఫిర్యాదు చేసినట్టు తన దృష్టికి వచ్చిందన్నారు. గృహ నిర్మాణ శాఖ అధికారులు మోటార్ల విషయంలో ఎందుకు రక్షణ చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. మరలా మోటార్లు ఏర్పాటు చేయాలంటే పురపాలక సంఘానికి అదనపు భారం అవుతుందన్నారు. ఆమెతో పాటు తహసీల్దార్ కృష్ణంరాజు, కమిషనర్ రామప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల వివరాలు నమోదు

రాజాం: పురపాలక సంఘ పరిధిలోని స్వీపర్లు, సెప్టిక్ ట్యాంకు వర్కర్లు, హెల్పర్ల వివరాలను విధిగా నమోదు చేయించాలని పురపాలక సంఘ కమిషనర్ రామప్పలనాయుడు ఆదేశించారు. బుధవారం వివిధ వార్డుల్లో పర్యటించారు. అనంతరం జెండా దిబ్బ వద్ద చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించారు. ఆయనతో పాటు శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ ఉన్నారు. అనంతరం తాగునీటి పైపులైన్లు పరిశీలించారు. ప్రతి రోజూ తాగునీరు సరఫరా కాకపోవడానికి గల కారణాలను గుర్తించి ఆర్డీఓ బి.శాంతి దృష్టికి తీసుకువెళ్లారు.

వేలాడితేనే ఇంటికి చేరేది



రాజాం-సాలూరు బస్సు ఫుట్‌పాత్‌పై విద్యార్థులు ఇలా..

రాజాం రూరల్, ఫిబ్రవరి 7: బస్సు ఫుట్‌బోర్డుపై వేలాడితే తప్ప ఇంటికి చేరలేని దుస్థితి విద్యార్థులకు ఎదురవుతోంది. రాజాం నుంచి చీపురుపల్లి, సంతకవిటి, మడ్డువలస, వంగర, తెర్లాం తదితర ప్రాంతాలకు వెళ్లే విద్యార్థులు నిత్యం సాయంత్రం ఇలా వెళ్లాల్సిందే. ప్రభుత్వ, ప్రయివేటు విద్యా సంస్థలతో పాటు శిక్షణ సంస్థలకు నిత్యం రెండు వేల నుంచి మూడువేల మంది విద్యార్థులు రాజాం వచ్చిపోతుంటారు. సాయంత్రం ఆరు గంటల తరువాత ఆ ప్రాంతాలకు బస్సులు లేకపోవడంతో ప్రమాదకర స్థితిలో ప్రయాణం చేయాల్సి వస్తోంది. సరిపడినన్ని బస్సులు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు.

మాతా రమాబాయి ఆలోచనలు కొనసాగించాలి





విజయనగరం, రాజాంలో రమాబాయి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న దృశ్యం

విజయనగరం దాసన్నపేట, ఫిబ్రవరి 7: భారతదేశ స్త్రీలకు కల్పించిన రాజ్యాంగ హక్కులు మాతా రమాబాయి అంబేడ్కర్ స్ఫూర్తితో కొనసాగుతున్నాయని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మోనిటరింగ్ కమిటీ సభ్యులు బొంగ భాను మూర్తి అన్నారు. బుధవారం అయ్యప్పనగర్‌లో స్వాతి వాటర్ ప్లాంట్ లో ఆమె జయంతి కార్యక్రమాన్ని మాతా రమాబాయి ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా భానుమూర్తి మాట్లాడుతూ, అంబేడ్కర్ హిందూ కోడ్ బిల్లు ద్వారా చట్టసభల్లో స్త్రీలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలన్న ఆలోచన మాతా రమాబాయి అంబేడ్కర్‌దేనన్నారు. మల్లాన స్వాతి, సత్యనారాయణ, మధుసూదనరావు, రామకోటి, సంతోష్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.

రాజాం: మాతా రమాబాయి అంబేడ్కర్ జయంతి కార్యక్రమం సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. రమాబాయి అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సీఐ డి.మోహన్‌రావు, జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు ఆర్.జయరాం, హాస్టల్ వార్డెన్ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి బొత్స ఎక్కడుంటే.. అక్కడ అవినీతే

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు నాగార్జున

విజయనగరం రూరల్: రాష్ట్ర మంత్రి బొత్స సత్యనారాయణ ఎక్కడుంటే.. అక్కడ అవినీతి జరిగి తీరుతుందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు నాగార్జున అన్నారు. బుధవారం టీడీపీ నాయకులతో కలిసి ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. విద్యాశాఖ అంటే ఎంతో ముఖ్యమైనదని, ఈ శాఖలో గతంలో ఎన్నడూ అవినీతి లేదన్నారు. కానీ మంత్రి బొత్స విద్యాశాఖలో కూడా భారీ అవినీతికి పాల్పడి, అవినీతి సామ్రాట్‌గా పేరు సార్థకం చేసుకున్నారన్నారు. గతంలో పుస్తకాలకి సంబంధించిన మెటీరియల్ తమిళనాడు రాష్ట్రం నుంచి, వాటిని పుస్తకరూపంలో మలిచి, ప్రింటింగ్ చేసేందుకు రాష్ట్రంలో చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు ప్రభుత్వాలు కాంట్రాక్టు ఇచ్చేవని, కానీ బొత్స బాధ్యతలు చేపట్టిన తరువాత తనకు కమిషన్లు ఇచ్చే 16 కంపెనీలకు కాంట్రాక్టు కట్టబెట్టి కోట్లాది రూపాయలు అవినీతికి పాల్పడడం దారుణమన్నారు. ఇటువంటి వారికి రానున్న ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని ఆయన ప్రజలను కోరారు.

బడ్జెట్ అంతా అంకెల గారడీ

లక్కవరపుకోట: రాష్ట్ర బడ్జెట్ అంకెల గారడీ అని.. ప్రజలను మోసం చేసేందుకు జగన్మోహన్‌రెడ్డి మరో అవతారం ఎత్తారని ఎస్.కోట టీడీపీ ఇన్‌చార్జి కోళ్ల లలితకుమారి తెలిపారు. బుధవారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బడ్జెట్‌లో రైతుల సంక్షేమం, రైతు రుణాలు, పంట నష్ట పరిహారం, రైతుల బీమా వంటి పద్దులు ఎక్కడా కనిపించలేదని విమర్శించారు. సంక్షేమం పేరుతో మరోసారి దోపిడీకి దిగేందుకు సిద్ధమవుతున్నారని మండిపడ్డారు. నేటికీ రాజధాని ఎక్కడో చెప్పలేక బడ్జెట్ కేటాయింపులు చేయలేదన్నారు. రాష్ట్ర బడ్జెట్ అంతా అంకెల గారడీయేనని, దీనివల్ల ఒరిగిందేమీ లేదని విమర్శించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళా కూలీ మృతి



లక్ష్మి(ఫైల్)

కొత్తవలస, ఫిబ్రవరి 7: రోడ్డు ప్రమాదంలో మహిళా కూలీ మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి కొత్తవలస సీఐ చంద్రశేఖర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తవలస పంచాయతీ 202 కాలనీకి చెందిన పిన్నంటి లక్ష్మి(45) రోజువారీ కూలీ నిమిత్తం భవన నిర్మాణ కార్మికురాలిగా పనులు చేసుకుంటోంది. ఈ క్రమంలో బుధవారం తాను పనిచేస్తున్న తాపీ మేస్త్రీ శ్రీనుకు చెందిన మోటార్ సైకిల్‌పై కొత్తవలస నుంచి పెందుర్తి వైపు వెళ్తుండగా చింతలపాలెం పంచాయతీ తాడివానిపాలెం కాటా సమీపంలో ఉదయం 10 గంటల సమయంలో ఆర్టీసీ బస్సు వెనుక నుంచి బలంగా ఢీకొంది. ఈ ఘటనలో బైక్‌పై ఉన్న లక్ష్మి తూలి బస్సు కింద పడిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందింది. బైక్ నడుపుతున్న తాపీమేస్త్రి శ్రీను స్వల్పంగా గాయపడ్డాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం శృంగవరపుకోట సీహెచ్‌సీకి తరలించారు. మృతురాలి భర్త సన్యాశిరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. మృతురాలికి భర్తతో పాటు నలుగురు పిల్లలు ఉన్నారు. ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్టు తెలిపారు. ఇదే ప్రాంతంలో ఇటీవల జరిగిన ప్రమాదంలో ఒక మహిళ మృతి చెందిన విషయం తెలిసిందే.

జూదరుల అరెస్ట్

వేపాడ: మండలంలోని జాకేరు గ్రామ సమీపంలో అక్రమంగా నిర్వహిస్తున్న ఎట్లు ఆటపై దాడిచేసి నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్టు వల్లంపూడి ఎస్ఐ కే.రాజేష్ తెలిపారు. కొద్ది రోజులుగా జాకేరు ప్రాంతంలో ఎట్లు ఆట విచ్చలవిడిగా సాగుతున్నట్టు వచ్చిన సమాచారంతో బుధవారం సిబ్బంది దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకోవడంతో పాటు వారి వద్ద నుంచి రూ. 57 వేల 400ల రూపాయల నగదు, నాలుగు సెల్‌ఫోన్లు, రెండు బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ తెలిపారు. పెదగుడిపాలలో సారా తయారీ కేంద్రంపై దాడి చేసి ఒక వ్యక్తిని పట్టుకుని 10 లీటర్లు నాటు సారాను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించామని ఎస్ఐ చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ ఏవి రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

మేం.. వైసీపీని వీడి టీడీపీలో చేరాం

జగన్ పత్రిక దుష్ప్రచారాన్ని ఖండించిన మజ్జిరామునిపేట గ్రామస్థులు






టీడీపీకి మద్దతు తెలుపుతున్న మజ్జిరామునిపేట గ్రామస్థులు, జగన్‌తో సెల్ఫీ తీసుకుంటున్న కొమ్ము జయమ్మ(ఫైల్)

రేగిడి, ఫిబ్రవరి 7: అప్పాపురం పంచాయతీలో అప్పాపురం, మజ్జిరామునిపేట గ్రామాలనుంచి ఇటీవల 75 కుటుంబాలు రాజాం నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి కోండ్రు మురళీమోహనరావు సమక్షంలో పార్టీలోకి చేరికపై జగన్ పత్రిక చేస్తున్న దుష్ప్రచారాన్ని మజ్జిరామునిపేటవాసులు తీవ్రంగా ఖండించారు. తాము నిజంగా వైసీపీ వాళ్లమేనని, ఆ పార్టీ విధానాలు, స్థానిక నాయకత్వం నచ్చక వైసీపీ నుంచి టీడీపీలో చేరామని, ఇది వాస్తవం అని స్పష్టం చేశారు. బుధవారం జగన్ పత్రికలో అప్పాపురం పంచాయతీలో కళావర్గీయులనే టార్గెట్ చేస్తు కోండ్రు టీడీపీవాళ్లకే పార్టీ కండువాలు వేస్తున్నారని వార్తలు రావడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు. టీడీపీ పార్టీ ఇన్‌చార్జిగా ఉన్న కోండ్రు మురళీమోహన్‌కే మా మద్దతు అని తెలిపారు. మజ్జిరామునిపేటలో అప్పటి వైసీపీ నాయకులు కొమ్ము వెంకట్రావు, కొమ్ము సింహాద్రినాయుడు, కిమిడి రమణ, కొమ్ము బాగినాయుడు ఆధ్వర్యంలో పలువురు ఒకచోటచేరి వైసీపీ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టారు. అప్పటి జగన్ పాదయాత్రలో వైసీపీకి చెందిన కొమ్ము జయమ్మ జగన్‌తో తీసుకొన్న ఫోటోలను, అప్పటి వైసీపీ బ్యానర్లలో నేతలతో ఉన్న ఫోటోలను బహిర్గతం చేశారు. రానున్న ఎన్నికల్లో చంద్రబాబు సిఎం కావడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. సమావేశంలో అప్పటి వైసీపీ క్యాడర్‌గా ఉన్న కిమిడి అంజమ్మ, తాడ్డి వనజాక్షి, బూరాడ జయమ్మ, తాడ్డి రామలక్ష్మి, కొమ్ము పార్వతమ్మ పలువురు ఉన్నారు.

ప్రభుత్వ కళాశాలలో చేరండి

శృంగవరపుకోట రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఉత్తీర్ణత సాధించిన తరువాత శృంగవరపుకోట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరాలని అధ్యాపకులు కోరారు. ఈ మేరకు ధర్మవరం ఉన్నత పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎస్.కోట ప్రభుత్వ కళాశాలలో ఉన్న సదుపాయాలను వివరించారు.

సనాతన ధర్మాన్ని పాటించాలి



కృత్రిమ అవయవాల తయారీ గురించి వివరిస్తున్న జగదీష్‌బాబు

కొత్తవలస, ఫిబ్రవరి 7 : సనాతన ధర్మాన్ని ప్రతి హిందువు పాటించాలని నొయిడా ఇస్కాన్ టెంపుల్ సహాధ్యక్షులు వేదాంత చైతన్యదాస్ స్వామిజీ తెలిపారు. బుధవారం మంగళపాలెం గ్రామంలోనున్న గురుదేవ చారిటబుల్ ట్రస్టును ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చాలా మందికి సనాతన ధర్మం గురించి తెలియక లేనిపోని వ్యాఖ్యానాలు చేస్తుంటారన్నారు. గురుదేవ చారిటబుల్ ట్రస్టును ఏర్పాటు చేసిన రాపర్తి జగదీష్ బాబు సనాతన ధర్మాన్ని ఆచరిస్తూ.. మరో పక్క నిరంతరం దివ్యాంగులకు సేవా కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. విర్కో ఫౌండేషన్ వారి రూ.20 లక్షల ఆర్థిక సాయంతో 288 మంది దివ్యాంగులకు కృత్రిమ అవయవాలను స్వామిజీ అందజేశారు. కృత్రిమ అవయవాల తయారీ కేంద్రాన్ని, గురుదేవ ఆసుపత్రిని సందర్శించారు. రాపర్తి జగదీష్ బాబు, బి.సురేంద్ర, రామారావు, ఫణీంద్ర, రాఘవేంద్ర, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలిలో దట్టంగా పొగమంచు



పొగమంచు కురుస్తున్న దృశ్యం

బొబ్బిలి, ఫిబ్రవరి 7: బొబ్బిలి ప్రాంతంలో బుధవారం వేకువజామున భారీగా పొగమంచు కురిసింది. వాహనదారులు, ఉదయం పూట నడకకు వెళ్లిన వారంతా తడిసి ముద్దయ్యారు. దట్టంగా కురిసిన పొగమంచు కారణంగా లైట్లు వేసుకొని వెళ్లినప్పటికీ రోడ్లు సరిగ్గా కనిపించక వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ఈ పొగమంచు మామిడిపూతపై తీవ్ర ప్రభావం చూపుతుందని రైతులు చెబుతున్నారు.

మా గ్రామాలను మున్సిపాల్టీలో విలీనం చేయవద్దు



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న మూడు గ్రామాల నాయకులు

సాలూరు: తమ గ్రామాలను మున్సిపాల్టీలో విలీనం చేసి, ప్రజల భవిష్యత్తును నాశనం చేయవద్దని కూర్మరాజుపేట, నెలిపర్తి, జీగిరాం పంచాయతీలకు చెందిన ముఖ్య నాయకులు సర్పంచ్ ఆముదాల నళిని, కోటి, గణపతి, రవి, దుర్గారావుతో పాటు పలువురు బుధవారం స్థానిక మున్సిపల్ కమిషనర్ పి.ప్రసన్నవాణిని కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ తమ పంచాయతీలను, గ్రామాలను విలీనం చేస్తామనే ప్రతిపాదన వచ్చిందని, దానికి అభ్యంతరం చెప్పామని తెలిపారు. ఇప్పుడు మళ్లీ ప్రభుత్వ అధికారులు ఆ ప్రతిపాదన తెరపైకి తెస్తున్నారని అన్నారు. తమ పంచాయతీలు, ఆయా పంచాయతీల పరిధిలో ఉన్న గ్రామాలు తీవ్ర ఇబ్బందులు పడతాయన్నారు. ప్రధానంగా గ్రామాల్లో ప్రజలకు మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణా ఉపాధి హామీ పథకం ఎంతో భరోసాగా ఉందని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లో కూడా తమ పంచాయతీలను, గ్రామాలను మున్సిపాల్టీలో కలపవద్దని కోరారు.

సెంటర్ లైటింగ్ స్తంభాన్ని ఢీకొట్టిన లారీ



విద్యుత్ వైర్లపై పడిన సెంటర్ లైటింగ్ స్తంభం

పార్వతీపురంటౌన్: పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలి వద్ద సెంటర్ లైటింగ్ స్తంభాన్ని ప్రమాదవశాత్తు లారీ ఢీ కొట్టింది. వివరాల్లోకి వెళ్తే... బుధవారం ఉదయం 5 గంటల సమయంలో విశాఖపట్నం నుంచి రాయపూర్‌కు వెళ్తున్న ఓ లారీ నాలుగు రోడ్ల కూడలి వద్దగల సెంటర్ లైటింగ్ స్తంభాన్ని ఢీ కొట్టింది. స్తంభం అదృష్టవశాత్తు కిందపడకుండా విద్యుత్ వైర్లపై ఉండిపోవడంతో అటుగా వెళ్లే పాదచారులు, స్థానికులు భయాందోళనలకు గురయ్యారు. ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో విద్యుత్, పోలీసు అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఉదయం 5 గంటల నుంచి 10 గంటల వరకు పట్టణంలోని పలు వీధులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగింది. విద్యుత్‌శాఖ అధికారులు త్వరితగతిన స్పందించి సరఫరాను పునరుద్ధరించారు. స్తంభాన్ని ఢీకొట్టిన లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు పట్టణ పోలీసులు తెలిపారు.

పోలింగ్ కేంద్రాల్లో పూర్తి సౌకర్యాలు కల్పించాలి



సెక్టార్ అధికారులతో మాట్లాడుతున్న తహసీల్దార్ సీతారామయ్య

జియ్యమ్మవలస: పోలింగ్ కేంద్రాల్లో పూర్తి సౌకర్యాలు కల్పించే బాధ్యత సెక్టార్ అధికారుల పై ఉందని తహసీల్దార్ డీవీ సీతారామయ్య ఆదేశించారు. బుధవారం ఆయన మండలానికి సంబంధించిన సెక్టార్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఎన్నికలు సమీపిస్తున్న దృష్ట్యా సెక్టార్ అధికారులు వారి పరిధిలో ఉన్న పోలింగ్ కేంద్రాలు పూర్తి పరిశీలన చేయాలన్నారు. అసౌకర్యాలు ఏమైనా ఉంటే వెంటనే సంబంధిత బీఎల్వోలతో మాట్లాడి త్వరగా సౌకర్యాలు ఏర్పాటు చేయించాలన్నారు. ప్రస్తుతం ఓటర్ల జాబితా ప్రచురితమైన నేపథ్యంలో ఇంకా ఏమైనా మార్పులు, చేర్పులు, తొలగింపులకు దరఖాస్తులు వస్తే పూర్తి పరిశీలన చేసి, నివేదిక పంపించేలా సూపర్‌వైజర్లు జాగ్రత్త వహించాలన్నారు. లేదంటే తగు మూల్యం చెల్లించుకోవలసి ఉంటుందని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పైడి శ్రీనివాసరావు, డిప్యూటీ తహసీల్దార్ రెడ్డి పకీరు, సెక్టార్ అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల విధులపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న అధికారులు

భామిని: ఎన్నికల విధుల నిర్వహణలో బీఎల్వోలు తదితర అధికారులు, సూపర్‌వైజర్లు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో కిషోర్ కుమార్ సూచించారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు ఉండాలన్నారు. సమస్యలుంటే తెలియజేయాలన్నారు. మౌలిక సదుపాయాలు పక్కాగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డీటీ శేఖర్, ఎంఆర్ఐ రాంబాబు, బీఎల్వోలు, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

జలజీవన్ మిషన్‌పై శిక్షణ



మాట్లాడుతున్న ఎంపీడీవో

గుమ్మలక్ష్మీపురం: మండలంలో ఇటీవల మంజూరైన ఇంటింటికి కొళాయి కలెక్షన్లు, జల జీవన్ పథకాలపై స్థానిక ఎంపీడీవో సమావేశ మందిరంలో బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణలో పంచాయతీ కార్యదర్శులు, ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది, ఇంజినీరింగ్ సహాయకులు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎంపీడీవో జగదీశ్‌కుమార్ మాట్లాడుతూ ఇప్పటివరకు మండలం లో మంజూరైన 216 ఇంటింటికి కొళాయి కనెక్షన్లకు సంబంధించి ఆయా ఇంజినీరిం గ్ సహాయకులు, పంచాయతీ కార్యదర్శులు, వ్యక్తిగత బ్యాంకు ఖాతాలను తెరవా లన్నారు. మండలంలో 79 గ్రామాల్లో కొళాయి కనెక్షన్లు పనులు పూర్తి చేసి, బ్యాం కు ఖాతాలను తెరవాల్సి ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ నాగేశ్వరరావు, ఏఈ ప్రవీణ్‌కుమార్, వెలుగు ఏపీఎం ఆదెయ్య, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

16న బంద్‌ను విజయవంతం చేయండి

బెలగాం: ప్రధాని మోదీ కార్పొరేట్ విధానాలను వ్యతిరేకిస్తూ ఈనెల 16న తలపెట్టిన దేశ వ్యాప్త గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలని కేంద్ర కార్మిక, రైతు సంఘాల సమన్వయ కమిటీ నాయకులు అప్పలనాయుడు, బంటు దాసు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక సుందరయ్య భవనంలో కరపత్రం విడుదల చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేసి 44 కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని కోరారు. నిత్యావసరాల ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. అ పదేళ్లలో పేదరికం 30శాతం పెరిగిందని అన్నారు. కార్యక్రమంలో రైతు, కార్మిక సంఘాల నాయకులు పి.రమణి, కె.మన్మథరావు, ఆర్.లక్ష్మునాయుడు, శ్రీను నాయుడు, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే రాష్ట్ర భవిష్యత్తు

- గ్రామాల్లో బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ
- వైసీపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రచారం

టీడీపీతోనే రాష్ట్ర భవిష్యత్తు సాధ్యమని ఆ పార్టీ నాయకులు తెలిపారు. జిల్లాలోని పలు గ్రామాల్లో బుధవారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను దుయ్యబట్టారు. టీడీపీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

చంద్రబాబుతోనే అభివృద్ధి

వీరఘట్టం: చంద్రబాబు సీఎంగా ఉంటనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని టీడీపీ పాలకొండ నియోజకవర్గ ఇన్‌చార్జి నిమ్మక జయకృష్ణ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ముచ్చర్ల వీధి, మేదర వీధి, చాకలి వీధుల్లో బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. జయకృష్ణ ఇంటింటికీ వెళ్లి సూపర్‌సిక్స్ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. రానున్న ఎన్నికల్లో వైసీపీని ఓడించాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి కర్నేన అప్పలనాయుడు, నాయకులు పొదిలాపు కృష్ణమూర్తి, ఉదయాన ఉదయ్ భాస్కర్, జామి లక్ష్మీనారాయణ, చింతా ఉమాభాస్కర్, నివర్తి శశి, మాచర్ల అనిల్, బల్లా హరి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మెగా డీఎస్సీ పేరుతో నిరుద్యోగులకు దగా

సీతంపేట: ఎన్నికలు సమీపిస్తుండడంతో నిరుద్యోగులను మభ్యపెట్టాలనే ఉద్దేశంతో మెగా డీఎస్సీ పేరుతో నిరుద్యోగులకు దగా చేస్తున్నారని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నిమ్మక జయకృష్ణ ఆరోపించారు. బుధవారం సీతంపేటలో డీఎస్సీ అభ్యర్థులు చేపట్టిన నిరసన ర్యాలీకి ఆయన సంఘీభావం తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం జనవరి 1న జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తానని చెప్పిన సీఎం జగన్‌రెడ్డి నాలుగున్నర సంవత్సరాల్లో చేసింది ఏమీ లేదన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు తోట ముఖలింగం, ఆర్.రంగనాథం, గంట సుధ, హిమరిక పవన్, సవర సంతోష్‌కుమార్, తోయక సంధ్యారాణి, నిమ్మక చంద్రశేఖర్, బిడ్డిక నీలయ్య తదితరులున్నారు.



సీతంపేట: డీఎస్సీ అభ్యర్థులకు సంఘీభావం తెలుపుతున్న జయకృష్ణ

100 కుటుంబాలు చేరిక

సీతానగరం: గాదెవలస గ్రామంలో బుధవారం టీడీపీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొల్లి తిరుపతిరావు, రౌతు వేణుగోపాల్‌నాయుడు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బొబ్బిలి, పార్వతీపురం నియోజకవర్గ ఇన్‌చార్జిలు బేబీ నాయన, బోనెల విజయచంద్ర పాల్గొని, గ్రామంలో ఇంటింటికి తిరిగి, సూపర్ సిక్స్ హామీలను ప్రజలకు వివరించారు. గ్రామంలో తెలుగుదేశం పార్టీ నాయకులు యంద్రపు ప్రసాద్, యంద్రపు తిరుపతి ఆధ్వర్యంలో 100 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు బాబు పాలూరి, పోల సత్యనారాయణ, బొమ్మినాయిని లక్ష్మణరావు, బూరాడ చిరంజీవి, బోగి శంకరరావు, నాయకులు పాల్గొన్నారు.

హామీలు ఏమయ్యాయి?

సాలూరు: పాదయాత్రలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తేనే ఓటు అడుగుతాను అని చెప్పి.. ఏ హామీలు అముల చేయకుండ ఇప్పుడు ఏం ముఖం పెట్టుకుని ప్రజలను ఓటు అడుగుతారని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యురాలు, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గుమ్మిడి సంధ్యారాణి ప్రశ్నించారు. బుధవారం సాలూరులోని తన నివాసంలో ఆమె స్థానిక విలేకర్లతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ జగన్‌రెడ్డిని ఇంటికి పంపేందుకు ప్రజలతో పాటు తెలుగుదేశం పార్టీ సిద్ధంగా ఉందన్నారు. ఈ కురుక్షేత్ర ధర్మయుద్ధంలో టీడీపీ-జనసేన పార్టీలు అఖండ విజయం సాధిస్తాయని అన్నారు. ఐదేళ్లలో జగన్‌రెడ్డి ఒక్క ప్రాజెక్టు కూడా పూర్తి చేయలేదని అన్నారు. కొత్త పన్నులు వేసి ధరలు పెంచి ప్రజలను అన్ని రకాలుగా ఇబ్బందులకు గురి చేశారని అన్నారు. జగన్‌రెడ్డి అభ్యర్థుల సీట్లు ప్రకటిస్తుంటే అభ్యర్థులు మాత్రం వైసీపీని వదిలిపెట్టి పోతున్నారని ఆమె ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు, సాలూరు, పాచిపెంట, మక్కువ, మెంటాడ మండలాల అధ్యక్షులు ప్రసాదరావు, వేణు, పరమేష్, వెంకటరమణ పాల్గొన్నారు.



సీతానగరం: పార్టీలోకి చేరినవారిని ఆహ్వానిస్తున్న విజయచంద్ర



సాలూరు: మాట్లాడుతున్న సంధ్యారాణి

నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

కురుపాం: మండలంలోని చిన్నారులు, విద్యార్థులకు ఈనెల 9వ తేదీన జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంలో భాగంగా ఆల్బెండజోల్ మాత్రలను మింగించాలని జిల్లా పంచాయతీ అధికారి బి.సత్యనారాయణ వైద్య సిబ్బందికి, పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఈ మేరకు బుధవారం కురుపాంలో వైద్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసంద ర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలల్లో 1 నుంచి 19 ఏళ్ల లోపు విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు మింగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శెట్టి పద్మావతి, ఈవోపీఆర్‌డీ జి.రమేష్, పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. ● **సాలూరు రూరల్:** సాలూరు మండలంలో అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలల్లో డీవార్మింగ్ మాత్రలు పంపిణీకి కార్యచరణ చేశారు. ఈసందర్భంగా సాలూరు ఎంఈవో కార్యాలయంలో ఒకటవ రాజకుమార్ ఆధ్వర్యంలో వైద్యాధికారి యామిని ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. డీవార్మింగ్ మాత్రలు వేసే విధానం వివరించారు. పాఠశాలల హెచ్‌ఎంలకు డీవార్మింగ్ మాత్రలను పంపిణీ చేశారు. పార్వతీపురం మన్యం జిల్లాలో 84,426 మంది బాలురకు, 88465 మంది బాలికలకు ఈ మాత్రలు పంపిణీ లక్ష్యంగా నిర్ణయించారు. ఈ మేరకు మండలాల వారీగా వైద్యాధికారులు ఉపాధ్యాయుల సమన్వయంతో ఈ కార్యక్రమం ఈనెల 9న నిర్వహించనున్నారు. ● **పార్వతీపురం ఆంధ్రజ్యోతి:** డీవార్మింగ్ కార్యక్రమం ద్వారా పిల్లల్లో రక్తహీనత, పోషకాహార లోపం నివారించవచ్చుని జిల్లా మలేరియా అధికారి టి.జగన్మోహన్‌రావు అన్నారు. మండలంలోని కృష్ణపల్లి, చినమరికి గ్రామాల్లో వెల్నెస్ కేంద్రాలను ఆయన బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈనెల 9న నిర్వహించనున్న డీవార్మింగ్ డే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం వెల్నెస్ కేంద్రాల్లో ఆరోగ్య తనిఖీల రికార్డులను, అందుబాటులో ఉంచిన మందులను, వైద్య పరికరాలను పరిశీలించారు. ఈ-సంజీవిని ద్వారా ఎంతమందికి వైద్య సేవలు అందించారు, గర్భిణులకు కిల్కారీ సేవలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఏఎంవో సూర్యనారాయణ, వైద్య సిబ్బంది టి.శిరీష, పి.నిర్మల, సీహెచ్ కృష్ణవేణి, బంగారునాయుడు, కన్నంనాయుడు, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీపీవో సత్యనారాయణ

రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయండి



ఉల్లిభద్రలో రికార్డులు పరిశీలిస్తున్న తహసీల్దార్ జయ

గరుగుబిల్లి: సచివాలయాల్లో నివాస స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిర్దేశించిన సమయానికి పూర్తి చేయాలని తహసీల్దార్ కె.జయ సూచించారు. బుధవారం ఉల్లిభద్ర సచివాలయాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు లబ్ధిదారుల నుంచి సమాచారాన్ని సేకరించి రిజిస్ట్రేషన్ నిర్వహించాలన్నారు. అనంతరం పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో పూర్తి స్థాయిలో మౌలిక వసతులు కల్పించేలా దృష్టి సారిస్తున్నామన్నారు. ఈ పరిశీలనలో ఆర్ఐ మండంగి కృష్ణ, కార్యదర్శి కోటేశ్వర రావు, వీఆర్వో ఎం.ధనుంజయరావు, కె.సురేష్ కుమార్ ఉన్నారు.

నర్సిపురం గ్రామానికి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు

పార్వతీపురం రూరల్: తమ గ్రామానికి తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ నర్సిపురం గ్రామస్థులు ఈనెల 5న కలెక్టరేట్ కార్యాలయం వద్ద టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బోనెల విజయచంద్ర, మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. తాగునీటి సమస్యపై కలెక్టర్ నిశాంత్‌కుమార్‌కు వివరించారు. దీనిపై కలెక్టర్ స్పందించి, బుధవారం నర్సిపురం గ్రామానికి ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారులను పంపించారు. సమస్యను తెలుసుకుని, రావాలని ఆదేశించారు. దీంతో అధికారులు గ్రామానికి వచ్చి విజయచంద్ర, టీడీపీ నాయకులు గొట్టాపు వెంకటరమణతో పాటు మహిళలతో చర్చించారు.

కిషోర్ చంద్రదేవ్‌ను కలిసిన పాలకొండ నాయకులు



కిషోర్ చంద్రదేవ్‌తో చర్చిస్తున్న టీడీపీ పాలకొండ నియోజకవర్గం నాయకురాలు భూదేవి

కురుపాం: టీడీపీ నాయకుడు, కేంద్ర మాజీ మంత్రి వైరిచర్ల కిషోర్ చంద్రదేవ్‌ను పాలకొండకు చెందిన పార్టీ నాయకురాలు పి.భూదేవి, ఇతర నాయకులు బుధవారం కురుపాంలోని తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా పాలకొండ నియోకవర్గంలో పార్టీ పరిస్థితిపై ఆయనతో చర్చించారు.

టీడీపీ నాయకుడి కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం: వాడపుట్టి గ్రామానికి చెందిన పువ్వాల శ్రీహరి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఆయన టీడీపీ సభ్యత్వం తీసుకోవడంతో ఆయన కుటుంబానికి పార్టీ నుంచి రూ.2లక్షలు సాయం అందింది. ఈ మొత్తాన్ని టీడీపీ కురుపాం నియోజకవర్గ ఇన్‌చార్జి తోయక జగదీశ్వరి బుధవారం శ్రీహరి భార్య చెంపలమ్మకు అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి దాసు, ఎస్టీ సెల్ కార్యదర్శి నరేష్, పోలూరు శ్రీను, అనీల్, సంతు, అన్నిబాబు ఉన్నారు.

శతశాతం పన్నులు వసూలు చేయాలి



మాట్లాడుతున్న కమిషనర్ సర్వేశ్వరరావు

పాలకొండ: శతశాతం పన్నులు వసూలు చేయాలని నగర పంచాయతీ కమిషనర్ సర్వేశ్వరరావు ఆదేశించారు. నగర పంచాయతీ, సచివాలయ ఉద్యోగులతో ఆయన బుధవారం సమావేశం నిర్వహించారు. ఎవరిపైనా ఒత్తిడి తేకుండా వసూలు చేయాలన్నారు. ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించి, నగర పంచాయతీ అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. మార్చి చివరి నాటికి నూరు శాతం ఆస్తి పన్ను వసూలు లక్ష్యంగా పనిచేయాలన్నారు. ముఖ్యంగా సచివాలయాల సెక్రటరీలు, బిల్ కలెక్టర్లు, ఇతర సిబ్బంది సచివాలయాల పరిధిలో ఆస్తి పన్ను వసూలు శతశాతం చేయాలన్నారు. ఈ సమావేశంలో ఆర్ఐ కె.గజపతిరావు పాల్గొన్నారు.

యూటీఎఫ్ నాయకుడు మురళీపై కేసు కొట్టివేత

బెలగాం: యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్.మురళిపై 2022లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారని పోలీసులు నమోదు చేసిన కేసును బుధవారం ఏజేఎఫ్‌సీఎం కోర్టు కొట్టివేసింది. జీవో నెం.117 తీసుకొచ్చి ప్రాథమిక పాఠశాలలను నిర్వీర్యం చేస్తున్నారని 2022లో ఆయన నిరసన చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారని ఆయనపై అప్పట్లో కేసు నమోదు చేశారు. ఎట్టకేలకు బుధవారం ఏజేఎఫ్‌సీఎం కోర్టు మురళిని నిర్దోషిగా తీర్పు విడుదల చేస్తూ కేసు కొట్టివేసింది. దీనిపై జిల్లాలో పలువురు ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

బడ్జెట్‌పై అభిప్రాయాలు

ఏ ప్రయోజనం లేదు..

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌తో ప్రజలకు ఎటువంటి ప్రయోజనం లేదు. పూర్తిగా ఇది అంకెలు గారడీ బడ్జెట్. వైసీపీ సర్కారు ప్రవేశపెట్టిన చివరి బడ్జెట్‌ను ఎవరూ నమ్మడం లేదు. కొత్త జిల్లాకు ఎటువంటి ప్రాధాన్యం కల్పించకపోవడం దారుణం.

- గుమ్మిడి సంధ్యారాణి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యురాలు, సాలూరు

ప్రజల విశ్వాసాన్ని కోల్పోయింది

వైసీపీ ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన చివరి బడ్జెట్ వల్ల ఎవరికీ ఎటువంటి ఉపయోగం లేదు. జిల్లాకు ఉపయోగపడే విధంగా ఎటువంటి కేటాయింపులు లేవు. దీంతో రాష్ట్ర సర్కారు పూర్తిగా ప్రజల విశ్వాసాన్ని కోల్పోయింది.

- ద్వారపురెడ్డి జగదీష్, టీడీపీ అధికార ప్రతినిధి, పార్వతీపురం

అంకెల గారడీ

రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి బుధవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ అంకెల గారడీగా ఉంది. దీనివల్ల జిల్లాకు ఎటువంటి ప్రయోజనం లేదు. బడ్జెట్ అంతా అబద్ధాల పుట్టగా ఉంది. అభివృద్ధికి నిధులు కేటాయించలేదు. ఇది కోతల బడ్జెట్. జిల్లాలో నీటి వనరులు, విద్య, వైద్య రంగాలకు పెద్దగా కేటాయిం పులు లేవు. బడ్జెట్ లోటును ప్రజలపై భారాలు వేసి పూడ్చుకోవడానికి ప్రభుత్వం సిద్ధమైంది. దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం.

- రెడ్డి వేణు, సీపీఎం నాయకుడు, బెలగాం

క్లుప్తంగా..

కురుపాం పీఏసీఎస్ అధ్యక్షురాలిగా లీల

కురుపాం: కురుపాం పీఏసీఎస్ అధ్యక్షురాలిగా కురుపాం పంచాయతీ పూతకవలస గ్రామానికి చెందిన శంబంగి లీల నియమితులయ్యారు. గతంలో అధ్యక్షుడిగా ఉన్న కె.గౌరీశంకరరావు స్థానంలో ఈమెను నియమిస్తూ రాష్ట్ర సహకార శాఖ ప్రధాన కార్యదర్శి చిరంజీవి చౌదరి ఉత్తర్వులు జారీ చేశారు. సభ్యులుగా గవర విజయ చంద్రశేఖర్, అద్దేపల్లి భాస్కరరావును నియమించారు.

ఆశా వర్కర్ల అరెస్టులు అన్యాయం

కురుపాం: తమ డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ ఈనెల 8న విజయవాడలో జరిగే ధర్నాకు బయలుదేరి వెళ్తున్న ఆశా వర్కర్లను అరెస్టు చేయడం, గృహ నిర్బంధం చేయడం అన్యాయమని జిల్లా వీఆర్‌పీ సంఘం జిల్లా అధ్యక్షుడు జి.ఈశ్వరరావు అన్నారు. బుధవారం కురుపాంలో ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ప్రభుత్వానికి తమ సమస్యలు పరిష్కరించాలని ప్రశ్నించిన ప్రతి ఒక్కరినీ పోలీసులతో భయభ్రాంతులకు గురి చేయడం అన్యాయమని అన్నారు.

ట్రాఫిక్ ఎస్ఐగా సత్యనారాయణ

బెలగాం: పార్వతీపురం పట్టణ ట్రాఫిక్ ఎస్ఐగా జి.సత్యనారాయణ బుధవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో సబ్బవరంలో లా అండ్ ఆర్డర్ విభాగంలో పని చేసి బదిలీపై పార్వతీపురం వచ్చారు.

పరిశుభ్రతపై నిర్లక్ష్యం వద్దు

గరుగుబిల్లి: గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో పైల సూర్యనారాయణ హెచ్చరించారు. రావివలస, రావుపల్లి గ్రామాల్లో పారిశుధ్య పనులను, సచివాలయాలను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు అసౌకర్యం కలగకుండా ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ పరిశీలనలో మండల విస్తరణాధికారి ఎల్.గోపాలరావు, ఏవో ఎస్.అర్జునరావు, సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

భద్రతా ప్రమాణాలు పాటించాలి



రోడ్డు భద్రతా వారోత్సవాలు నిర్వహిస్తున్న దృశ్యం

కురుపాం రూరల్: రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా బుధవారం మొండెంఖల్‌లో రవాణా శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. వాహనదారులు ప్రయాణంలో భద్రతా ప్రమాణాలు పాటించాలని, అధిక లోడ్‌తో వెళ్లరాదని, మైనర్లు డ్రైవ్ చేయరాదని, హెల్మెట్లు, సీట్ బెల్టులు పెట్టుకోవాలని సూచించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఆర్టీవో సి.మల్లికార్జున రెడ్డి, ఏఎంవీఐ జి.సత్యనారాయణ, మొండెంఖల్ సర్పంచ్ ఐ.గౌరీశంకర్రావు, మోటార్ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు. ● **సాలూరు:** వాహనదారులు రహదారి నియమా లు తప్పక పాటించాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ జేవీఎస్ఎస్ ప్రసాద్ కోరారు. పట్టణంలో బుధవారం రహదారి భద్రతపై డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ రహదారి భద్రత పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు డ్రైవర్లు పాల్గొన్నారు.

ఒడిశా

ముగిసిన ఆత్మరక్షణ శిబిరం



శిక్షణ తీసుకుంటున్న విద్యార్థినులు

రాయగడ: యువతపై జరుగుతున్న వివిధ రకాల దాడుల నుంచి తమను తాము రక్షించుకునేందుకు స్థానిక అటానమస్ కళాశాల విద్యార్థులకు జనవరి 31 నుంచి నిర్వహిస్తున్న ఆత్మరక్షణ శిబిరం శిక్షణ బుధవారంతో ముగిసింది. ఈసందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ బాబిలత షారాఫ్ మాట్లాడుతూ మహిళలు, యువతపై మృగాళ్ల దాడులు విపరీతంగా పెరిగిపోతున్నాయని, వీటి నుంచి రక్షణకు శిక్షణ ఇచ్చామని తెలిపారు. మొత్తం 312 మంది విద్యార్థులు శిక్షణ తీసుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కామర్స్ అధ్యాపకురాలు కేశవ్‌కుమార్ జానీ పాల్గొన్నారు.

పారిశ్రామిక శిక్షణతో ఉపాధి

రాయగడ: పారిశ్రామిక శిక్షణతో యువతకు ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని, ఉద్యోగం లభించకపోయినా సొంతంగా ఉపాధి అవకా శాలు కల్పించుకోవడంతో పాటు మరో నలుగురికి చేయూత అందించే అవకాశం ఉంటుందని శిక్షణ అధికారి సంతోష్‌కుమార్ స్వియి అన్నారు. స్థానిక యూజీఎంఐటీ ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో ఓ భాగమైన సెంట్రల్ టూల్ అండ్ ట్రైనింగ్ సెంటర్ ద్వారా విద్యార్థులకు వివిధ ట్రేడ్‌లలో ఉచితంగా శిక్షణ అందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో సంతోష్ మాట్లాడుతూ ఉన్నతాశ యాలతో శిక్షణ పూర్తిచేసుకుని కోరుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలని హితవు పలికారు.



యువతకు శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయులు

ఖనిజ సంపద వేలం పాటపై అవగాహన

రాయగడ: జిల్లా సమావేశ భవనంలో బుధవారం ఒడిశా మైనింగ్ కార్పొరేషన్ అధికారి సత్యజిత్ రౌత్ అధ్యక్షతన సూక్ష్మ ఖనిజ సంపదలు (ఇసుక, గిట్టి) వంటి వాటి వేలం పాటపై కంట్రాక్టర్లకు అవగాహన శిబిరం నిర్వహించారు. రిజిస్ట్రేషన్ చేయించుకోవడం మొదలు టెండర్లు ఎలా వేయాలి, వేలం ఏవిధంగా పాడాలి తదితర అంశాలపై కంట్రాక్టర్లకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్లు తమ ఇబ్బందులను అధికారులకు విన్నవించుకున్నారు. కార్యక్రమంలో మైనింగ్ అధికారి పరశురాం ప్రధాన్, డిప్యూటీ కలెక్టర్ సూర్యమణి బొయి తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల మార్పుపై సమావేశం



మాట్లాడుతున్న కలెక్టర్ మహాజన్

రాయగడ: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల సందర్భంగా జిల్లాలోని మూడు నియోజకవర్గాల పరిధిలో పోలింగ్ కేంద్రాల మార్పుపై కలెక్టర్ మనోజ్ సత్యవాన్ మహాజన్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. రాయగడ, గుణుపురం, బిషమ్‌కటక్ నియోజకవర్గాల పరిధిలో కొన్ని పోలింగ్ కేంద్రాల పేర్లను మార్చారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ భాస్కరచంద్ర రొయిత్, సబ్ కలెక్టర్, ఎన్నికల అధికారిణి కళ్యాణి సంఘ మిత్ర దేవి, డిప్యూటీ కలెక్టర్ సూర్యమణి బొయి, గుణుపురం అసిస్టెంట్ కలెక్టర్ సత్యజిత్ నాయక్, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి సంకర్షణ్, మంగరాజ్, బిజూ జనతాదళ్ ప్రతినిధి దేబాశిష్ ఖడంగా, భారతీయ జనతా పార్టీ తరఫున కె.అశ్విని, ఆమ్‌ఆద్మీ పార్టీ తరఫున జె.సేనాపతి తదితరులు పాల్గొన్నారు.